# సింగిల్ పేజి కథలు


## నాకూ హీరోయిన్ కావాలి

సాయంకాలం నాలుగున్నర అయింది. హాల్లో బాబిగాడి డాన్సు ప్రాక్టీసుకి ఏర్పాట్లన్నీ జరిగిపోతున్నాయి. బాబిగాడి అక్క పదేళ్ల వాణి టేపురికార్డరు, కేసెట్లు తెచ్చి అక్కడున్న బల్ల మీద పెట్టింది. ప్రేక్షకురాళ్లుగా వాడి నానమ్మ ఒకవైపు నుంచి కొంగుతో తడి చేతులు తుడుచుకుంటూ వచ్చి సోఫా మీద కూలబడితే, మరొక వైపు నుంచి రాజమ్మ గిన్నెలు కడుగుతున్న పని మధ్యలోనే ఆపి "బాబుగారి డాన్స్ అప్పుడే మొదలయిపోనాదేటి" అంటూ వచ్చి గుమ్మం దగ్గర నిలబడింది.

"అమ్మా.. నేను ఆడుకొంటానే.. డాన్సు తరువాత నేర్చుకొంటానే" అంటూ దీర్ఘాలు తీస్తున్న ఆరేళ్ల బాబిగాడిని "చూడు నాన్నా.. ఆటలు ఎప్పుడేనా ఆడుకోవచ్చు. నీ ప్రోగ్రాం ఇంక వారం రోజులే కదా ఉంది. బాగా ప్రాక్టీస్ చేసి స్టేజి మీద చక్కగా చేసేవనుకో అన్ని ప్రైజులు నీకే ఇస్తారు. పైగా అక్కడికొచ్చిన వాళ్లంతా బాబిగాడెంత బాగా డాన్స్ చేసేడని తెగ మెచ్చుకొంటారు. ఈ అబ్బాయి ఎవరబ్బాయి అని తెలీనివాళ్లెవరైనా అడిగితే ఫలానా జయ, మధులు గారి అబ్బాయి అని చెబితే మాకెంత గర్వంగా ఉంటుందో తెలుసా?" అని లాలనగా వాడి చెయ్యి పట్టుకొని లాక్కొస్తుంది వాళ్ల అమ్మ జయ.

బాబిగాడికిదంతా చాలా చిరాగ్గా ఉంది. ఇదివరలో అయితే కాన్వెంటు నుంచి రాగానే కాళ్లు, చేతులు కడుక్కుని అమ్మ పెట్టిందేదో తిని చక్కగా శంకర్ వాళ్లతో ఆడుకుందుకు వెళ్లేవాడు.

ఈమధ్య ఇదేం పిచ్చి పట్టిందో అమ్మకి, ఆడుకొందుకి వెళ్లనివ్వదు. ఎప్పుడూ డాన్స్.. డాన్స్ అంటుంది. టీవీలో డాన్సులొస్తూ ఉంటే హోంవర్కు చేసుకొంటున్నా సరే తీసుకొని వెళ్లి "చూడూ బాబీ వాళ్లు స్టెప్పులెలా వేస్తున్నారో జాగ్రత్తగా చూడు" అంటూ అక్కడ కుదేస్తుంది.



ఎక్కడ టీవీ ప్రోగ్రాములైనా అందులో పాల్గొనేదాకా షంటుతుంది. అమ్మ మాటకి నాన్న ఎదురుచెప్పలేడు. మేకప్ ఉమెన్‌గా అమ్మ వెంట రావలసిందే. బాబిగాడి చిన్నబుర్రలో ఆలోచనలు దొలిచేస్తున్నాయి.

అంతవరకు అక్కడే కూర్చుని పేపరు చదువుకొంటున్న బాబిగాడి తాతగారు వెంకటరావు హూ.. తతంగం మళ్లీ మొదలు అనుకొంటూ పేపరు చేత్తో పట్టుకొని పక్క గదిలోకి వెళ్లిపోయాడు.

జయ పిల్లాడి చేత డాన్స్ చేయించడానికి తెగ హైరానా పడిపోతోంది. కొత్త కొత్త సినిమాల్లో జనాల్ని ఉర్రూతలూగించే పాటలన్నీ రికార్డు చేయించింది. అవి ప్లే చేస్తూ ఉంటే ఆ ఆరేళ్ల పసివాడు తెగ ఊగిపోతున్నాడు. క్రింద పడుతున్నాడు, మీద పడుతున్నాడు, శరీరమంతా పూనకం వచ్చిన వాడిలా తెగ ఊపేస్తున్నాడు. మనవడి విన్యాసాలు చూసి శాంతమ్మ తెగ ముచ్చటపడిపోతోంది. వాడెక్కడేనా స్టెప్పు సరిగ్గా వెయ్యకపోతే వాళ్ల అమ్మో, అక్కో చేసి చూపించి మరీ సరిదిద్దుతున్నారు.

పక్క గదిలో పేపరు పట్టుకొన్న వెంకటరావుకి పేపరు మీద మనసు పోవడం లేదు. పని వెధవ ఆడే పాడే వయస్సులో ఇలాంటి డాన్సులా.. అసలు అవి డాన్సులా.. పిచ్చి గంతులు కాకపోతే..

తమ చిన్నతనాల్లో తల్లో, తండ్రో, తాతయ్యో, నాన్నమ్మలో ఎవరికి తీరికైతే వాళ్లు పిల్లల్ని దగ్గర పడుకోపెట్టుకొని ఎంచక్కా వేమన పద్యాలో, సుమతీ శతకమో, భర్తృహరి సుభాషితాలో వల్లె వేయించేవారు. నీతి కథలు చెప్పేవారు. ఇప్పుడెంతసేపు టీవీల సంస్కృతి.

మనసులో మాట దాచుకోలేక ఒకమారు కోడలితో ఇలాగే అంటే పిచ్చివాడి వైపు చూసినట్లు ఒక చూపు విసరి "ఈ కాలంలో ఎవరికి కావాలండీ అవన్నీ. అవన్నీ పాతచింతకాయ పచ్చళ్లు" అంటూ మూతి ముడుచుకొని లోపలికెళ్లిపోయింది. అక్కడే ఉన్న కొడుక్కూడా "కాలానికి తగ్గట్టు మనం కూడా ఉండాలి డాడీ" అంటూ భార్య వెనకే లోపలికెళ్లిపోయాడు.

ఆ మాటలన్నీ వింటూన్న శాంత బయటికొచ్చి "మీకెందుకండీ కోడలికి తెలియదా ఏమిటి ఎప్పుడో మీ కాలంలో అలా ఉండేవారని ఇప్పుడు కూడా ఉండమంటే ఎలా? మీరూ.. మీ చాదస్తపు మాటలునూ.." అంటూ వాళ్లిద్దరి వెనకాలే వెళ్లిపోయింది. ఆమె ఆ పాట పాడటం ఆమెకి మొదలు నుంచి అలవాటే. అప్పటి నుంచి వాళ్ల పిల్లలు వాళ్లిష్టం అంటూ నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నాడు వెంకటరావు.

"ఏంరా బాబీ.. ఎంతసేపూ ఆ పాటలేనా ఏదైనా భక్తి పాటకి డాన్స్ వెయ్యకూడదూ" మనవణ్ని కోరింది శాంతమ్మ.

"ఏమిటీ.. భక్తిపాటలకి డాన్సా" ఫకాలున నవ్వింది కోడలు.

"అలాంటి పాటలకి డాన్సు చెయ్యరు నాన్నమ్మా" అంది వాణి. ఇంత తెలివితక్కువతనమా అన్నట్లు చూస్తూ.

"అదేమిటే అలా అంటావ్. ఈమధ్య నేను చూసిన సినిమాల్లో త్యాగరాజస్వామి వారి కృతులకి, రామదాసు కీర్తనలకి కూడా డాన్సులు చేస్తున్నారు కదా" అంటూ బుగ్గలు నొక్కుకుంది శాంతమ్మ.

"ఊరుకో నాన్నమ్మా.. అలాంటి పాటలకి డాన్సులు చేస్తే ఎవరూ చూడరు" వాణి నాన్నమ్మకి బోధపరిచింది.

"సరేలేవే వాడికిష్టం వచ్చిందే చెయ్యని" రాజీపడిపోయింది శాంతమ్మ.

"ఒరేయ్ బాబీ లక్స్‌పాపా..లక్స్‌పాపా.. లంచ్‌కొస్తావా పాటకి డాన్స్ చెయ్యరా. అది చాలా బాగుంటుంది. పాట వెయ్యనా.." తెగ ఉత్సాహపడిపోతోంది వాణి.

అంతే ఆ మాటతో బాబిగాడి బుర్రలో ఏదో ఫ్లాష్ వెలిగింది. ఒక్క ఉదుటున వెళ్లి మమ్మీ పక్కన సోఫాలో చతికిలపడిపోయి మోకాళ్లలో తలపెట్టుకొని కూర్చున్నాడు. తల్లి, నాన్నమ్మ, అక్కడున్న పనిమనిషితో సహా అందరూ వాడి చర్యకు ఆశ్చర్యపోతున్నారు.

ఆ పాటకి డాన్స్ చెయ్యమంటే వాడెందుకంత మూడీ అయిపోయాడు. అంతవరకు ఉషారుగా డాన్స్ చేసినవాడు ఒకే ఒక్క నిముషంలో ఎందుకలా అయిపోయాడు? అక్కడెవరికీ అర్థం కావడం లేదు. తలలు బద్ద

లుకొట్టుకుంటున్నారు. ఒకళ్ల వంక ఒకళ్లు బేలగా చూసుకొంటున్నారు. ఎవరికైనా కారణం తెలుసేమోనని. నాకు తెలీదంటే నాకు తెలీదన్నట్టు తలలు అడ్డంగా ఊపుతున్నారు. ఎన్ని విధాల బ్రతిమాలినా వాడు జవాబు చెప్పడం లేదు. మోకాళ్లలోంచి తలెత్తడం లేదు.

హాల్లో ఒక్కమారు నిశ్శబ్దం ఆవరించటంతో గదిలో ఉన్న వెంకటరావు ఆశ్చర్యపోయాడు. ఇంకో గంటేనా సాగే ఈ ప్రహసనం అప్పుడే ముగిసిపోయిందంటే కారణం ఏమై ఉంటుందబ్బా... ఎవరేనా వచ్చారా.. పేపరు పట్టుకొని బయటకొచ్చాడు వెంకటరావు.

బయటవాళ్లెవరూ లేరే.. హాల్లో సీను చూడ్డానికి చాలా బాగుంది. అంతటా నిశ్శబ్దమే. వెంకటరావుకి అంతుపట్టటం లేదు.

నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ "ఒరేయ్ బాబీ.. ఎందుకలా కూర్చుండిపోయావే చెప్పకపోతే తంతాను జాగ్రత్త" జయ కంఠం ఖంగుమంది. బాబిగాడి దగ్గర నుంచి రెస్పాన్స్ లేదు. జయ కోపం పట్టలేకపోతోంది. చెయ్యెత్తి దగ్గరకెళ్లబోయింది.

"ఆగమ్మా.. కొట్టకు నేను కనుక్కుంటానుగా" జయని వారించి వెంకటరావు బాబిగాడి తల మీద ప్రేమగా చెయ్యేసి "ఏంరా నాన్నా.. కాళ్లు పీకెడుతున్నాయా. కడుపేమైనా నొప్పెడుతుందా చెప్పు నాన్నా?" అన్నాడు లాలనగా.

అంతే ఒక్కసారి బాబిగాడికి ఉక్రోషం ముంచుకొచ్చింది. "చూడండీ తాతగారు. ఇకమీదట నేను డాన్సులు చెయ్యాలంటే నా పక్కన ఒక పాప నాతోపాటు డాన్స్ చేస్తేనే నేను డాన్స్ చేస్తా. సినిమాల్లో, టీవీల్లో చూడటం లేదూ.. ఆ పాప, హీరో డాన్స్ చేస్తుంటే ఎంచక్కా హీరో, ఆ పాప కిందపడి మీద పడి దొర్లి దొర్లి డాన్సులు చేస్తారు. అమ్మా ఇదే చెప్తున్నా నాకూ హీరోయిన్ కావాలి లేకపోతే నువ్వెంత తన్నినా డాన్స్ నై..నై" అంటూ వీధిలోకి ఆడుకోడానికి పరుగెత్తేడు.

వెంకటరావుతో సహా అక్కడున్న వాళ్లంతా అవాక్కయ్యారు.

**-వి.సత్యవతీదేవి** (గుమ్మలక్ష్మీపురం)

☆ ☆ ☆

# దంత వేదాంతం

"వింటున్నారా! అదమ్మా సంగతి..మనం తిన్నది మట్టిపాలు ఒకరికి పెట్టింది మనపాలు అని, మన పొట్ట నింపుకోడమే కాదు ఆకలితో అలమటించేవాళ్లకి, అమ్మా అని వాకిట్లోకి వచ్చిన వాళ్లకి ఒక ముద్ద పెడుతుండాలి" ఏమంటారు? అన్నట్లు అందరివైపూ చూసింది వర్ధనమ్మగారు.

ఆ కాలనీలో ఆమే కాస్త పురాణాలు చదివి భక్తి గురించి చెప్పగల సమర్థురాలు. అందరూ ఆమెనెంతో గౌరవంగా చూస్తారు. ఎవరింటికైనా వచ్చినప్పుడు అంతా చేరి మంచి విషయాలు చెప్పించుకుంటూ ఉంటారు.

చుట్టూ చేరి శ్రద్ధగా వింటున్న ఆడవాళ్ల మొహాల్లో మెచ్చుకోలు. "ఎంత బాగా చెపుతున్నారు. వర్ధనమ్మగారూ! తెల్లారి లేచిందగ్గర్నించీ మాకు ఈ సంసార జంజాటంలో పడి మునిగితేలడమే గానీ కృష్ణా రామా! అనుకోడానికి కూడా తీరి చావదాయె" విచారం వ్యక్తం చేశారంతా.

"జన్మ ఎత్తినందుకు సార్థకం చేసుకోవాలమ్మా. మనకు చేతనైనంత ఇతరులకి ఉపకారం చేస్తుండాలి. అనిత్యానీ శరీరానీ అందరి సొమ్ము నాకే రానీ అన్నట్లు పైకి వైరాగ్యం ప్రదర్శిస్తూ స్వార్థం చూసుకోకూడదు. మనకున్న దాంట్లోనే కొద్దిగా 'గానుగలోదే గరిటడు' అన్నట్లు దానధర్మాలు చేస్తుండాలి. పేదవాళ్లని ఒక కంట కనిపెడుతూ అవసరమైనప్పుడు ఆదుకుంటూ ఉండాలి. రేపు పోయే నాడు మన వెంట పూచికపుల్ల కూడా రాదు. మనం చేసుకున్న పాపపుణ్యాలు తప్ప. అమ్మాయ్, మీరు నమ్మండి మానండి నా మనసెప్పుడూ భగవంతుడి గురించే ఆలోచిస్తూ ఉంటుంది తప్ప మరో ధ్యాస ఉండదు"



"నమ్మకపోవడమేమిటి వర్ధనమ్మగారూ! ప్రత్యక్షంగా చూస్తూనే ఉన్నాంగా" అన్నారంతా.

"మరి నేనొస్తానమ్మా" కుర్చీలోంచి లేచిందావిడ.

"అప్పుడేనా, ఇంకాస్సేపుండండి వర్ధనమ్మగారూ" బలవంతం చేశారు.

"లేదమ్మా, నేనొచ్చి చాలా సేపైంది. కోడలు కొత్త పిల్ల" అంది. అక్కడ కూర్చున్నదన్న మాటే గానీ ఆమె మనసంతా ఇంటి మీదే ఉంది. కోడలేం మిడిమేళం చేస్తున్నదో అని. చదువుకున్నదాన్నని, అందగత్తెనని మహా నీలుగుడు పిల్లకి.

"అప్పుడప్పుడవా వస్తుండండి వర్ధనమ్మగారూ. మీ పుణ్యమా అంటూ నాలుగు మంచి మాటలు వినగలుగుతున్నాం."

"దానికేం భాగ్యం. అలాగే వస్తూంటే, తెలిసిన విషయాలు పదిమందికీ చెపితేనే గదా పరమార్థం దక్కేది. ఎవరెలా పోతే నీకెందుకూ అనుకుంటే మనిషి జన్మ ఎత్తి ప్రయోజనమేమిటి? పరోపకారం మిదం శరీరం" అన్నారు పెద్దలు.

"ఎవరు చూసినా వయసుతో నిమిత్తం లేకుండా టీవీ సీరియల్స్‌తో కాలం గడిపేస్తున్న ఈ రోజుల్లో ఈమె పనిగట్టుకుని వచ్చి ధర్మం బోధిస్తున్నది. మంచీ చెడ్డా వివరిస్తున్నది. ఎంత పుణ్యాత్మురాలు" తలా ఒక రకంగా మెచ్చుకున్నారు ఆమె వెనక.

ఇల్లంత దూరాన ఉండగానే వాకిట్లో కనపడిన దృశ్యం వర్ధనమ్మగారికి గంగిర్లెత్తించింది.

ముష్టిదానికి పాతచీర దారాదత్తం చేస్తోంది కోడలు.

"ఏమిటేవ్ మహాజోరుగా చేస్తున్నావ్ దానధర్మాలు" రంకెలేసుకుంటూ వచ్చింది.

"పాపం! చలికి తట్టుకోలేకపోతున్నానంటే పాతచీర ఇస్తున్నానత్తయ్యగారూ. కట్టుకోడానికో, కప్పుకోడానికో పనికివస్తుంది."

"ఆహా! గొప్ప పని చేస్తున్నావ్. స్టీలు క్యారేజీ తీసుకోవాలని పాతచీరలు పోగేస్తుంటే వాటి మీద పడ్డాయా నీ కళ్లు" మండి పడిందామె.

"ఇప్పుడు మనకి స్టీలు సామానుకేం తక్కువైంది అత్తయ్యగారు. డాబాగదుల్లో రగ్గులు కప్పుకుని పడుకుంటేనే చలికి ఆగలేకపోతున్నాం. పాపం! చెట్ల క్రింది, పేవ్‌మెంట్ల మీదా వాళ్లెంత బాధపడతారో ఆలోచించండి" బ్రతిమాలుతూ అంది కోడలు.

"గుడ్డొచ్చి పిల్లను వెక్కిరించిందట. నువ్వా నాకు నీతులు చెప్పేది. ఎవరి ఖర్మకెవరు కర్తలు? ఏ జన్మలోనో చేసుకున్న పాపం ఈ జన్మలో అనుభవిస్తున్నారు. తప్పుతుందా తలరాత. నువ్వొక పాత చీర ఇచ్చినంత మాత్రాన వాళ్ల దరిద్రం తీరిపోతుందా! ఆ చీర అది ముట్టుకున్నట్లుంది. పసుపునీళ్లు చల్లి లోపల పెట్టు" అంటూ కోడలికి కర్తవ్యమూ, కర్మ సిద్ధాంతము బోధించి రామనామం జపించుకుంటూ లోనికెళ్లింది వర్ధనమ్మగారు.

**-జె.సరస్వతి** (గుంటూరు)